RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 251 | సంపుటి 4 | గురువారం | 04-06-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రభాత గమనం

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374




# అర్హత ఉన్నా.. ఆశ్రయం సున్నా..!

- మొదటి జాబితాలో పేరు ఉన్నా పూర్తికాని ఇంటి నిర్మాణం
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ చెట్టు కిందే కాలం వెళ్లదీస్తున్న కుటుంబం
- వర్షాకాలం సమీపిస్తుండటంతో ఆందోళనలో లబ్ధిదారులు
- రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బీజేపీ డిమాండ్
- అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి

## చెట్టు కిందే ఇందిరమ్మ లబ్ధిదారురాలి నివాసం

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తామంటూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హురాలిగా ఎంపికైంది.. తొలి జాబితాలోనే పేరు నమోదైంది.. అధికారుల నుంచి మంజూరు పత్రం కూడా అందుకుంది. కానీ నెలలు గడుస్తున్నా ఇంటి నిర్మాణం మాత్రం పూర్తికాలేదు. ఫలితంగా గార్ల మండలానికి చెందిన ఓ నిరుపేద మహిళ కుటుంబం నేటికీ చెట్టు కిందే జీవనం సాగిస్తోంది. మండుటెండల్లో ఎండకు ఎండుతూ, ఇప్పుడు ముంచుకొస్తున్న వర్షా ల భయంతో బిక్కుబిక్కుమంటూ రోజులు గడుపుతోంది. ప్రభుత్వం గుర్తించిన అర్హురాలికే ఈ పరిస్థితి ఉంటే ఇంకా జాబితాల్లో చోటు దక్కని నిరుపేదల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవైపు పథకాల ప్రచారం, మరోవైపు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల అవస్థలు ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై తీవ్ర విమర్శలకు తావిస్తున్నాయి. వర్షా కాలం ప్రారంభానికి ముందే ఆ కుటుంబానికి పూర్తి స్థాయి గృహం కల్పించకపోతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్నా ఆశ్రయం లేని ఈ కుటుంబం కథ ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

— గార్ల, జూన్ 03 (ప్రభాత గమనం):




## అగ్నిప్రమాదంలో పామాయిల్, మామిడి తోటలు దహనం


- మద్దివంచలో గుర్తు తెలియని వ్యక్తుల ఘాతుకం
- నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి: ఏఐకేఎంఎస్

గార్ల, జూన్ 3 (ప్రభాత గమనం) :

మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో ఘోర కలియుగం చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలిసిన కొందరు దుండగులు పామాయిల్, మామిడి తోటలకు నిప్పు పెట్టడంతో దాదాపు రెండు ఎకరాల్లో పంట పూర్తిగా బూడిదైంది. రైతుల శ్రమ అంతా అగ్నిపాలవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.మద్దివంచ గ్రామానికి చెందిన రైతు ములుపూరి సుజాతమ్మకు చెందిన పామాయిల్ తోటతో పాటు, ఆమె తోట పక్కనే ఉన్న గౌడి మంగయ్యకు చెందిన మామిడి చెట్లకు నిన్న అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వేసవి గాలుల తీవ్రతకు మంటలు క్షణాల్లో వ్యాపించడంతో రెండు ఎకరాల్లోని తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి.

## తెలంగాణలో 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష...

04




## తెలంగాణలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల..

# నాణ్యమైన శిక్షణతోనే సమర్థ పోలీసింగ్..

- తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించిన డీజీపీ సి.వి. ఆనంద్
- అకాడమీలో శిక్షణ, మౌలిక సదుపాయాల పరిశీలన
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక శిక్షణకు ఆదేశాలు
- మహిళా పోలీసుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడి
- పోలీస్ ట్రైనింగ్ కాలేజీలు, జిల్లా శిక్షణా కేంద్రాల బలోపేతానికి ప్రాధాన్యం
- శిక్షణా సంస్థలకు అవసరమైన అన్ని సౌకర్యాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ




ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అధిపతి (డీజీపీ-హెచ్ఓపీఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీజీపీ సి.వి. ఆనంద్ బుధవారం హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించారు. అకాడమీకి చేరుకున్న ఆయనకు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ ఘన స్వాగతం పలికారు. అనంతరం అకాడమీ అధికారులు డీజీపీకి గౌరవ వందనం సమర్పించారు. సందర్శన సందర్భంగా డీజీపీ అకాడమీలోని యూనిట్ హాస్పిటల్, పరిపాలనా విభాగం, ఆడిటోరియం, తరగతి గదులు, మెస్‌లు, క్రీడా భవన్, ఫైరింగ్ రేంజ్, పరేడ్ గ్రౌండ్లు తదితర శిక్షణా, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం అకాడమీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి శిక్షణా కార్యక్రమాలు, మౌలిక వసతులు, సంస్థాగత బాధ్యతలు, సంక్షేమ కార్యక్రమాలు, అకాడమీ ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు.




## వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా వెంకటరమణ

### సీపీని కలిసిన డీఎస్పీ

# సమయపాలన ఎక్కడ..?

### ఉదయం 11 దాటినా ఖాళీగా రెవెన్యూ కార్యాలయాలు

- అధికారుల కోసం గంటల తరబడి వేచి చూసిన ప్రజలు
- సమస్యల పరిష్కారం కోసం వస్తే తప్పని నిరీక్షణ
- "ప్రజలకు ఒక నిబంధన.. అధికారులకు మరో నిబంధనా?" అంటూ ఆగ్రహం
- బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ అమలుపై ప్రశ్నలు..







## నందిగామ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్ ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు యువకులు మృతి



చెట్టు కిందే ఇందిరమ్మ లబ్ధిదారురాలి నివాసం

# అర్హత ఉన్నా.. ఆశ్రయం సున్నా!

- మొదటి జాబితాలో పేరు ఉన్నా పూర్తికాని ఇంటి నిర్మాణం
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ చెట్టు కిందే కాలం వెల్లదీస్తున్న కుటుంబం
- వర్షాకాలం సమీపిస్తుండటంతో ఆందోళనలో లబ్ధిదారులు
- రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బీజేపీ డిమాండ్
- అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి

**గార్ల, జూన్ 03 (ప్రభాత గమనం):**

ప్రభుత్వాలు మారుతున్నా, సంక్షేమ పథకాల పేర్లు మారుతున్నా నిరుపేదల కష్టాలు మాత్రం తీరడం లేదనే పరిస్థితి గార్ల మండలంలో వెలుగుచూసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి జాబితాలో పేరు వచ్చినప్పటికీ, ఇప్పటికీ ఇల్లు నిర్మాణం పూర్తికాక ఓ నిరుపేద కుటుంబం చెట్టు కిందే జీవనం సాగించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మండలానికి చెందిన మస్నా ప్రసాద్ సోదరి కవిత కుటుంబం అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవిస్తోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఆమెకు ఇల్లు మంజూరైనప్పటికీ, నెలలు గడుస్తున్నా నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ఆ కుటుంబం ప్రస్తుతం చెట్టు కిందే ఆశ్రయం పొందుతోంది. వేసవి కాలంలో ఎండలను తట్టుకుని జీవించిన ఈ కుటుంబం ఇప్పుడు వర్షాకాలం సమీపిస్తుండటంతో తీవ్ర ఆందోళన చెందుతోంది. వర్షాలు ప్రారంభమైతే తలదాచుకునేందుకు కూడా సరైన చోటు లేకపోవడం వారి పరిస్థితిని మరింత విషమంగా మారుస్తోంది. ఈ ఘటనపై భారతీయ జనతా పార్టీ నాయకులు స్పందించారు. బీజేపీ గార్ల మండల నాయకుడు గుగులోత్ దేవా మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం రాజకీయాలకు అతీతంగా అమలు కావాలని, అర్హులైన ప్రతి నిరుపేదకు న్యాయం జరగాలని అన్నారు. మొదటి జాబితాలో పేరు ఉండి కూడా ఇల్లు లేక చెట్టు కింద జీవిస్తున్న కవిత కుటుంబాన్ని చూసైనా అధికారులు స్పందించాలని కోరారు. తక్షణమే సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాలు ప్రారంభమయ్యే లోపు బాధిత కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించాలని, లేకపోతే వారి తరపున పోరాట కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# తెలంగాణలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల..

**హైదరాబాద్ జూన్3(ప్రభాత గమనం):**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్సి) మూడు ముఖ్యమైన నోటిఫికేషన్లను విడుదల చేసింది. రోడ్లు, భవనాల శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (సివిల్), 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఎలక్ట్రికల్) పోస్టులు, అలాగే పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో 19 అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ఉద్యోగాలు ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు 18 నుండి 44 ఏళ్ల వయోపరిమితిని నిర్ణయించారు. సివిల్ పోస్టులకు జూన్ 6, ఎలక్ట్రికల్ పోస్టులకు జూన్ 8, ఎన్విరాన్‌మెంటల్ పోస్టులకు జూన్ 10 నుండి ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది.





# అగ్నిప్రమాదంలో పామాయిల్, మామిడి తోటలు దహనం

- మద్దివంచలో గుర్తు తెలియని వ్యక్తుల ఘాతుకం
- నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి: ఏఐకేఎంఎస్

**గార్ల, జూన్ 3 (ప్రభాత గమనం) :**

మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో ఘోర కలియుగం చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలిసిన కొందరు దుండగులు పామాయిల్, మామిడి తోటలకు నిప్పు పెట్టడంతో దాదాపు రెండు ఎకరాల్లో పంట పూర్తిగా బూడిదైంది. రైతుల శ్రమ అంతా అగ్నిపాలవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.మద్దివంచ గ్రామానికి చెందిన రైతు ములుపూరి సుజాతమ్మకు చెందిన పామాయిల్ తోటతో పాటు, ఆమె తోట పక్కనే ఉన్న గౌడి మంగయ్యకు చెందిన మామిడి చెట్లకు నిన్న అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వేసవి గాలుల తీవ్రతకు మంటలు క్షణాల్లో వ్యాపించడంతో రెండు ఎకరాల్లోని తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే బూడిద కావడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.విషయం తెలుసుకున్న ఆల్ ఇండియా కిసాన్ మజ్దూర్ సభ నాయకులు గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని దెబ్బతిన్న తోటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వారిని పరామర్శించారు.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి గౌని మల్లేశం మాట్లాడుతూ... రైతులు ఎంతో కష్టపడి పెంచిన పామాయిల్, మామిడి తోటలను గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టడం అత్యంత దారుణమన్నారు. ఈ అగ్నిప్రమాదం వల్ల రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అలాగే ఈ ఘాతుకానికి ఒడిగట్టిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు శ్రీరాములు, వెంకన్న, రోశయ్య, గుంశ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులు పొడి దుక్కిలో విత్తనాలు వేయొద్దు

- ఏడీఏ శ్రీనివాసరావు
- విత్తన దుకాణాల్లో ముమ్మర తనిఖీలు
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలంటూ హెచ్చరికలు
- రైతులు విధిగా బిల్లులు తీసుకోవాలని సూచన

**కేసముద్రం, జూన్ 3(ప్రభాత గమనం ):**

తొలకరి పలకరింపుల నేపథ్యంలో రైతులు తొందరపడి పొడి దుక్కిలో పత్తి విత్తనాలు వేసుకోవద్దని మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీర శ్రీనివాస్ రావు సూచించారు. బుధవారం కేసముద్రం మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్నతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా దుకాణాల్లోని పత్తి విత్తన నిల్వలు, వాటికి సంబంధించిన ఇన్వాయిస్‌లు, స్టాక్ రిజిస్టర్లు, మరియు సోర్స్ సర్టిఫికెట్లను (పిసిలు) అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం విత్తన డీలర్లను ఉద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి డీలర్ తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్‌లు, పిసిలను మెయింటైన్ చేయాలని స్పష్టం చేశారు. రైతులకు విక్రయించే ప్రతి విత్తనానికి విధిగా రశీదులు (బిల్లులు) ఇవ్వాలని ఆదేశించారు. విత్తన చట్టం 1966 ప్రకారం ఎవరైనా డీలర్లు నియమ నిబంధనలను అతిక్రమించినా, అక్రమాలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా రైతులకు పలు కీలక సూచనలు చేస్తూ.. ప్రభుత్వ అనుమతి పొందిన అధికారిక విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొన్న ప్రతిదానికి తప్పకుండా బిల్లులు అడిగి తీసుకోవాలని కోరారు. పొడి దుక్కిలో పత్తి విత్తనాలు వేస్తే విత్తనం యొక్క జన్యు స్వచ్ఛత లోపించడమే కాకుండా, మొలక శాతం తగ్గి, అంతిమంగా దిగుబడులు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల కనీసం 60 మిల్లీమీటర్ల వర్షపాతం రెండుసార్లు పడిన తర్వాతే పత్తి విత్తనాలు నాటుకోవాలని స్పష్టం చేశారు.గ్రామాల్లో ఎవరైనా లూజు (విడి) పత్తి విత్తనాలు గానీ, ఎలాంటి లేబుల్ లేని విత్తనాలు గానీ అమ్మితే కొనుగోలు చేయవద్దని, అటువంటి సమాచారాన్ని వెంటనే వ్యవసాయ లేదా పోలీస్ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేని, గ్లైఫోసేట్ ఆధారిత నిషేధిత బీజీ-3 (బిజి-3) పత్తి విత్తనాలను కొని రైతులు మోసపోవద్దని హెచ్చరించారు.భూసారాన్ని పెంపొందించుకోవడానికి రైతులు జీలుగా, పెసర వంటి పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలను వాడాలని, అవి పూత దశకు వచ్చినప్పుడు భూమిలోనే కలియదున్నడం ద్వారా భూమికి పోషకాలు అంది మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు వివరించారు.ఈ తనిఖీలు మరియు అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్నతో పాటు స్థానిక డీలర్లు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




## జన గణన- ఇండ్ల గణన
# వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఇప్పటివరకు జరిగిన సర్వే వివరాల ఆన్లైన్ నివేదికలను పరిశీలించిన కలెక్టర్

**మహబూబాబాద్, జూన్ 3(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న జన గణన 2027, ఇండ్ల సర్వే వేగంగా పూర్తి చేయాలని, ఖచ్చితమైన సమాచారాలను సేకరించి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అర్బన్, రూరల్ పరిధిలో సర్వే సిబ్బంది ఎనిమినేటర్స్, సూపర్వైజర్స్, చేస్తున్న పనులను మండల స్థాయిలో తహసిల్దార్లు (చార్జి ఆఫీసర్స్ ) క్షేత్ర పర్యటన చేస్తూ తనిఖీలు నిర్వహించాలని, సూచించారు. గుర్తించిన డోర్ లాక్ గృహాలను మరి ఒకసారి సందర్శించి సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన సర్వే వివరాల ఆన్లైన్ నివేదికలను కలెక్టర్ పరిశీలించారు. ఎనిమినేటర్లు సర్వే వివరాలను వెంటవెంటనే సూపర్వైజర్ లాగిన్లకు సింక్ చేయాల్సిందిగా సూచించారు. తద్వారా జిల్లా నమోదు వివరాలు రాష్ట్రస్థాయిలో రికార్డు అవుతాయని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, తహసిల్దారులు, జీ.వివేక్, నాగ భవాని, రాజేశ్వరరావు, శ్రీనివాస్ , విజయ, మున్సిపల్ కమిషనర్లు,ఏఎస్ఓ లు తదితరులు పాల్గొన్నారు.



# కన్నవారి కడుపుకోత తీర్చలేనిది..

- రాహుల్ ముదిరాజ్ మృతి బాధాకరం
- అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించిన సమ్మి గౌడ్
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం

**కేసముద్రం జూన్ 3(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువకుడు నూకల రాహుల్ ముదిరాజ్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం తీవ్ర విషాదకరమని సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బతుకు తెరువు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరిలో నివసిస్తూ ఉద్యోగం చేస్తున్న రాహుల్, విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో లారీ ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిసిందన్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి విచారణ జరిపి అసలు ఏం జరిగిందో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ విషాద వార్త తెలుసుకున్న వెంటనే ఉప్పరపల్లి గ్రామానికి చేరుకున్న సమ్మయ్య గౌడ్, రాహుల్ భౌతికకాయానికి పూలమాల వేసి అశ్రునివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని చివరి వీడ్కోలు పలికారు. యువకుడి మృతితో కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదంలో రాహుల్ మొబైల్ ఫోన్ పూర్తిగా ధ్వంసం కావడంతో అతడిని వెంటనే గుర్తించడం సాధ్యపడలేదన్నారు. అనంతరం కొంతమంది స్థానికులు ఫోన్‌లోని సిమ్ కార్డును మరో మొబైల్‌లో అమర్చి అందులో సేవ్ అయిన నంబర్ల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిసిందన్నారు.

ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి సీసీటీవీ ఫుటేజ్, లారీ డ్రైవర్ వివరాలు, ఇతర ఆధారాలను కోరినప్పటికీ వాటిని అందించలేదని కుటుంబ సభ్యులు వాపోతున్నట్లు తెలిపారు. అలాగే ప్రమాదానికి కారణమైన లారీని ఘటన స్థలం నుంచి తరలించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నప్పటికీ ఆ వివరాలను కుటుంబ సభ్యులకు పూర్తిగా వెల్లడించలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ స్థానిక వ్యక్తికి చెందినదని, డ్రైవర్ కూడా అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో ఘటనపై మరిన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ అనుమానాలకు తెరపడాలంటే అధికారులు పారదర్శకంగా వ్యవహరించి సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, లారీ వివరాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రజల ముందుంచాలని కోరారు. అలాగే ఈ విషయాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ దృష్టికి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా వారి సహకారం కోరుతామని తెలిపారు. అవసరమైతే జిల్లా ఎస్పీతో పాటు ఉన్నతాధికారులను కలిసి పూర్తి స్థాయి విచారణ జరిగే వరకు తమ వంతు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. "కన్నవారి కడుపుకోతను ఎవరూ తీర్చలేరు.. కానీ నిజాలు బయటపడి న్యాయం జరిగితేనే ఆ కుటుంబానికి కొంత ఊరట లభిస్తుంది" అని సమ్మయ్య గౌడ్ పేర్కొన్నారు...





# సమయపాలన ఎక్కడ..?

- ఉదయం 11 దాటినా ఖాళీగా రెవెన్యూ కార్యాలయాలు
- అధికారుల కోసం గంటల తరబడి వేచి చూసిన ప్రజలు
- సమస్యల పరిష్కారం కోసం వస్తే తప్పని నిరీక్షణ
- "ప్రజలకు ఒక నిబంధన.. అధికారులకు మరో నిబంధనా?" అంటూ ఆగ్రహం
- బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ అమలుపై ప్రశ్నలు..

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:**

హనుమకొండ జిల్లాలోని పలు రెవెన్యూ కార్యాలయాల్లో సమయపాలన పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితులు బుధవారం వెలుగుచూశాయి. ప్రజలకు అత్యవసర సేవలు అందించాల్సిన అధికారులు, సిబ్బంది ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయాలకు హాజరుకాకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలు, మూతబడిన గదులు మాత్రమే కనిపించగా, ఆదాయ, కుల, నివాస ధృవపత్రాలు, భూసమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్న నేపథ్యంలో సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



### కార్యాలయాల చుట్టూ ప్రజల పడిగాపులు

ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, పలు రెవెన్యూ కార్యాలయాల్లో 11 గంటలు దాటినా అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. గ్రామీణ ప్రాంతాల నుంచి తెల్లవారుజామునే వచ్చిన రైతులు, వృద్ధులు, మహిళలు అధికారుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది.

### పూర్తికాని పనులతో తిరుగు ప్రయాణం

ధరణి దరఖాస్తులు, భూ రికార్డుల సవరణలు, ఆదాయ, కుల, నివాస ధృవపత్రాల కోసం వచ్చిన ప్రజలు అధికారుల గైర్హాజరీతో పనులు పూర్తిచేసుకోలేక వెనుదిరిగారు. ఒక రోజు కూలి పనిని వదిలి వచ్చినా పని కాకపోవడంతో మళ్లీ రావాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

### బయోమెట్రిక్ వ్యవస్థ అమలు ఎక్కడ..?

ప్రభుత్వం కార్యాలయాల్లో సమయపాలన కోసం బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది ఎంతవరకు అమలవుతోందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సమయానికి హాజరుకాని సిబ్బందిపై పర్యవేక్షణ లోపిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు సమయపాలన, నిబంధనల గురించి సూచించే అధికారులు, ఉద్యోగులే వాటిని పాటించకపోవడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడాలంటే విధుల పట్ల బాధ్యతతో వ్యవహరించి సమయపాలనను కచ్చితంగా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహస్తే ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# తెలంగాణలో రోడ్ల విస్తరణకు కేంద్రకేబినెట్ ఆమోదం

**హైదరాబాద్, జూన్ 3(ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులు చేపట్టేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో.. ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల హైవే (ఎన్‌హెచ్ 63)ను హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో, జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 563)ను బీవోటీ పద్ధతిలో విస్తరించనున్నారు. రూ.7,597 కోట్లతో 190 కిలోమీటర్ల మేర ఈ రహదారులను 4 వరుసలుగా అభివృద్ధి చేయనున్నారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కోసం రూ.39,290 కోట్ల పెట్టుబడికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.



# బీజేపీకి కార్యకర్తలే అసలైన బలం

- జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు
- కేసముద్రంలో బీజేపీ అత్యవసర సమావేశం
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి పిలుపు

**కేసముద్రం, జూన్ 03 (ప్రభాత గమనం ):**

భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం కేసముద్రం మండల కేంద్రంలోని ఆంధ్ర మిల్ ఆవరణలో బీజేపీ అత్యవసర సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలుస్తూ, స్థానిక సమస్యలపై అనునిత్యం పోరాడాలని పార్టీ శ్రేణులను కోరారు. ముఖ్యంగా ఎన్నికల ప్రక్రియలో బూత్ స్థాయి పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లు అందరూ బూత్ స్థాయి అధికారులతో నిరంతరం అనుసంధానమై ఉండాలని, రాబోయే 'ఎస్.ఐ.ఆర్' ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓట్ల నమోదు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగేలా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలన్నారు.త్వరలోనే నిర్వహించబోయే 'జిల్లా ప్రశిక్షణ తరగతులు' పార్టీ శ్రేణులకు ఎంతో కీలకమని, ఈ శిక్షణా తరగతులను అందరూ బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేయాలని క్యాడర్‌కు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నరసింహ రెడ్డి, న్యాయ విభాగం జిల్లా నాయకులు తుంపిల్ల శ్రీనివాస్, మున్సిపల్ కన్వీనర్ బోగోజు నాగేశ్వరాచారి, మండల ఉపాధ్యక్షురాలు నాగరబోయిన చంద్రకళ పాల్గొన్నారు. అలాగే మండల నాయకులు బచ్చు లక్ష్మీనారాయణ, లెంకలపెల్లి శ్రీనివాస్, గాంతి వెంకట రెడ్డి, వేముల సతీష్ రెడ్డి, మంగిశెట్టి నాగయ్య, కాటం వెంకట్ రెడ్డి, ముదిరెడ్డి మురళీధర్, దారవత్ రంగమ్మ, దేశబోయిన కుమార్, వేల్పుల ఐలయ్య, గుండు దామోదర్, ఐత సారయ్య, నరేష్, సురేందర్, బేతి వెంకన్న, బానోత్ సంపత్, విజయ్, రవీందర్, జుజ్జూర్ వీరభద్రాచారి, యుగంధర్‌లతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల 'శక్తి కేంద్రం' ఇంచార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధిపత్య పార్టీలకు ఇక దింపుడుగల్లమే..

- భువనగిరి సభతో ఆ పార్టీలు గల్లంతు
- రెడ్లు, రావులను ఇగ అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వం
- లక్ష మందితో భువనగిరిలో భారీ బహిరంగ సభకు టీఆర్పీ సిద్ధం
- సభకు రాజ్యాధికార సమరభేరిగ నామకరణం
- 7200 లక్ష్యం నెరవేరింది... ఇగ మిగిలింది బీసీ రాజ్యాధికారమే
- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన
- టీఆర్పీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్

**యాదాద్రి, జూన్ 3(ప్రభాత గమనం) :**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అధ్యక్షతన బుధవారం రాష్ట్ర స్థాయి సమావేశం భువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్ లో నిర్వహించడం జరిగింది.భువనగిరి బహిరంగ సభ కోసం ఏర్పాటు చేసిన 13 కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు..ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ హాజరై పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ..జూలై 5వ తేదీన భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు రాజ్యాధికార సమరభేరి గా పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నామకరణం చేసినట్లు ప్రకటించారు.అలాగే సభ నిర్వహించే స్థలం అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ కి బెల్లి లలిత సభా ప్రాంగణంగా నామకరణం చేసినట్లు తెలియజేశారు.భువనగిరి సభ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో సమూలమైన మార్పులు జరుగుతాయని అగ్రవర్ణ పార్టీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు.ఇప్పటికే తీన్మార్ మల్లన్న లేవనెత్తిన బీసీ ఉద్యమ నినాదం రెడ్ల,రావుకు నిద్ర లేకుండా చేస్తుందని,ఎలాగైనా బీసీ వాదాన్ని అణిచివేయాలని అగ్రవర్ణ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని అన్నారు.ఐతే వారు కుట్రలను ఎప్పటికప్పుడు పసి గడుతున్న తీన్మార్ మల్లన్న తనదైన శైలిలో ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు.భువనగిరి రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయడానికి రాష్ట్ర స్థాయి నాయకులు నుండి గ్రామ కార్యకర్త వరకు కలిసి కట్టుగా పని చేస్తూ సభ నిర్వహణ కోసం పార్టీ ఏర్పాటు చేసిన 13లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ యాదవ్ మాట్లాడుతూ భువనగిరి సభను ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకొని సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు..అలాగే రాబోయే రోజుల్లో ఈ అగ్రవర్ణ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ప్రజలందరూ నూతన పార్టీ వైపు చూస్తున్నారని,మన పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందని తెలియజేశారు.గతంలో తీన్మార్ మల్లన్న స్థాపించిన 7200 గురించి ఈ సందర్భంగా మాదం రజినీ యాదవ్ క్లారిటీ ఇచ్చారు.7200 అనేది రాష్ట్రంలో ఉన్న వెలమల ఇండ్ల గడపల సంఖ్య అని, కేసీఆర్ ను గద్దె దింపడం కోసం 7200 అనే మూమెంట్ ను తీసుకొచ్చి ఆ మూమెంట్ ద్వారా ప్రజలను చైత్యన పరిచి కేసీఆర్ గద్దె కూల్చామని వివరించారు.7200 అంతం కాలేదని అది విజయం సాధించి బీసీ రాజ్యాధికార స్థాపన కోసం మరో ఉద్యమ పంథాలోకి మారిపోయిందని స్పష్టం చేశారు..

మల్లన్న గారి నాయకత్వంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రోజు రోజుకు బలపడుతుందని,పార్టీ గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి మరింతలా బలోపేతం చేస్తూ ప్రతి గ్రామం నుండి భువనగిరి బహిరంగ సభకు ప్రజలను తరలించేలా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వాడుతూ ప్రజలను నిత్యం చైత్యన పరచాలని పిలుపునిచ్చారు.అనంతరం పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి పలువురు జిల్లా స్థాయి సభ్యులను రాష్ట్ర కమిటీలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు..అలాగే భువనగిరి జిల్లాకు సంబంధించి పలువురికి పదవులు ఇస్తూ నియామక పత్రాలు భువనగిరి జిల్లా అధ్యక్షులు కొమిరిశెట్టి నర్సింహులు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ చేతుల మీదుగా ఇచ్చారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గంగాధర్ లింగాల,వేములవాడ మదన్ మోహన్ చారి,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ,ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్,క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బంధారపు నర్సయ్య,కోశాధికారి కొక్కలకొండ మనోజ్,మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్,రాష్ట్ర కార్యదర్శులు ఆర్.భవన్ వెంకటేష్,నగేష్ ముదిరాజ్,రమేష్ యాదవ్,కొమ్ముల ప్రవీణ్ రాజ్,ఆకుల హనుమాన్లు,శివవీర్ రెడ్డి, పసల ప్రసన్న,అఖిల్ పాషా,రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మనోజ్ ఆకుల,యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్,కార్మిక విభాగం అధ్యక్షుడు సంకూరి శ్రీనివాస్,విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజు,మైనారిటీ విభాగం అధ్యక్షులు సల్మాన్,ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్,రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్,సుతారపు రంగన్న తో పాటు 33 జిల్లాల అధ్యక్షులు,13 కమిటీల కన్వీనర్లు సభ్యులు,పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎంజీఎం ప్రక్షాళనకు కీలక నిర్ణయాలు

- సమస్యల పరిష్కారానికి అభివృద్ధి కమిటీలో సమగ్ర సమీక్ష
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడమే వైద్యుల బాధ్యత : మంత్రి కొండా సురేఖ
- డాక్టర్లకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి : ఎంపీ కడియం కావ్య
- ఎంజీఎం, ఇతర ఆస్పత్రుల అభివృద్ధికి పూర్తి సహకారం : ప్రజాప్రతినిధులు




**వరంగల్, జూన్ 3 (ప్రభాత గమనం):**

ఉత్తర తెలంగాణ ప్రజలకు వైద్య భరోసాగా నిలుస్తున్న ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి, సమస్యల పరిష్కారం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లపై బుధవారం నిర్వహించిన ఎంజీఎం అభివృద్ధి కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జిల్లా కలెక్టర్, ఎంజీఎం అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య, నర్సింగ్ సిబ్బంది పోస్టులు, అత్యవసర విభాగంలో రద్దీ, ఆధునిక వైద్య పరికరాల కొరత, పెండింగ్ బిల్లులు, ఆరోగ్యశ్రీ నిధులు, నర్సింగ్ స్కూల్ భవనం సమస్యలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎంజీఎంలో ఉన్న మౌలిక వసతుల సమస్యలు, పరికరాల కొరత, సిబ్బంది అవసరాలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా సేవలు అందించాలని సూచించారు.

### బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అందుకే డాక్టర్లకు బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎంజీఎం రాష్ట్రంలోనే ఆదర్శ వైద్య సంస్థగా నిలవాలని, అవసరమైన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు.

### న్యూరో సర్జరీ సేవలపై ఆరా

ఆస్పత్రిలో న్యూరో సర్జరీల సంఖ్య తగ్గడంపై ఎంపీ అధికారులను ప్రశ్నించారు. న్యూరో సర్జరీ విభాగాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

### కార్పొరేట్ స్థాయి వైద్యం లక్ష్యం

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నైపుణ్యం కలిగిన వైద్యులను నియమించి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి ప్రాంగణంలో రోగుల సౌకర్యార్థం బ్యాటరీ వాహనాల ఏర్పాటుపై కూడా దృష్టి సారించాలని కోరారు.

### ఎంజీఎం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రి ప్రక్షాళన, మౌలిక వసతుల అభివృద్ధి, సిబ్బంది నిర్వహణ, పరిపాలనా సంస్కరణల కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఆస్పత్రి సేవలను మరింత మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఎంజీఎం ఆస్పత్రి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరి చంద్రారెడ్డి, వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూమి, కూలీ, ఉపాధి రక్షణకై ఉద్యమించండి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య పిలుపు
- కేసముద్రంలో ఘనంగా ముగిసిన వ్యవసాయ కార్మిక సంఘం 3వ మహాసభలు
- జూన్ చివరి వారంలో 'భూపోరాటం' చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

**కేసముద్రం, జూన్ 3(ప్రభాత గమనం):**




తెలంగాణ రాష్ట్రంలో భూమి, కూలి, మరియు ఉపాధి రక్షణకై పేద ప్రజలందరూ రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని హరహర గార్డెన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం 3వ మహాసభలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ మహాసభల ప్రారంభ సూచికగా సంఘం జిల్లా నాయకులు గోడిశాల వెంకన్న సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సంఘం ఉపాధ్యక్షులు ఎండి. యాకుబ్, బాణాల రాజన్న, అందే మంజుల అధ్యక్షతన ప్రతినిధుల సభ కొనసాగించారు.ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన జి. నాగయ్య మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలను విస్మరించి, భూస్వాముల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు.తెలంగాణలో భూస్వాముల చేతుల్లో ఇంకా 10 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందని, ప్రభుత్వం వెంటనే దానిని స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. లేనియెడల జూన్ చివరి వారంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పేదలే స్వయంగా భూములను వెలికితీసి పంచుకుంటారని హెచ్చరించారు.ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు కేవలం రూ. 150 నుండి రూ. 200 మాత్రమే ఇస్తున్నారని, ఈ విధానాన్ని మార్చి రోజువారీ కనీస వేతనాన్ని రూ. 600 కి పెంచాలని డిమాండ్ చేశారు.ఉపాధి కూలీలకు పని ప్రదేశాలలో మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు వంటి కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు భూమి లేని ప్రతి కూలీకి సంవత్సరానికి రూ. 12,000 ఇస్తామని 'కూలి బంధు' పథకాన్ని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక ఆచరణలో పేదలకు ఎగనామం పెట్టిందని ఆరోపించారు.ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, గిరిజన మరియు గిరిజనేతరులకు నామమాత్రంగా కాకుండా పూర్తి స్థాయిలో పోడు భూముల హక్కు పత్రాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు."కూలీల ఆత్మగౌరవం పెరగాలన్నా, పేదరికం పోవాలన్నా భూస్వాముల దగ్గర నిరుపయోగంగా ఉన్న భూములను పేదలకు పంచాలని తెలిపారు. పనికి తగ్గ కూలి, ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాల సాధన కోసం రానున్న రోజుల్లో రాజీలేని పోరాటాలు చేస్తామని తెలిపారు."ఈ మహాసభల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలవాల వీరయ్య, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సాదుల శ్రీనివాస్, ఆకుల రాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత పాల్గొన్నారు.వీరితో పాటు వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ బొల్లం అశోక్, పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి నక్క సైదులు, రాష్ట్ర కమిటీ సభ్యులు వంగూరి వెంకటేశ్వర్లు, కేసముద్రం మండల కార్యదర్శి గుడిశాల వెంకన్న, మండల అధ్యక్షులు ముద్రకోల సారయ్య, కావటి నర్సయ్య, బొబ్బల యాకుబ్ రెడ్డి, నీరుటి జలంధర్, శ్రీశైలం, జయరాజు, మోడెం వెంకటేశ్వర్లు, సావిత్ర, చందా వెంకన్న, గంధసిరి శ్రీను, కడియం సత్యం, ఇసంపల్లి సైదులు, రమేష్ బోర, స్వామి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాణ్యమైన శిక్షణతోనే సమర్థ పోలీసింగ్..

- తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించిన డీజీపీ సి.వి. ఆనంద్
- అకాడమీలో శిక్షణా, మౌలిక సదుపాయాల పరిశీలన
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక శిక్షణకు ఆదేశాలు
- మహిళా పోలీసుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడి
- పోలీస్ ట్రైనింగ్ కాలేజీలు, జిల్లా శిక్షణా కేంద్రాల బలోపేతానికి ప్రాధాన్యం
- శిక్షణా సంస్థలకు అవసరమైన అన్ని సౌకర్యాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ



**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అధిపతి (డీజీపీ–హెచ్ఓపీఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీజీపీ సి.వి. ఆనంద్ బుధవారం హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించారు. అకాడమీకి చేరుకున్న ఆయనకు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ ఘన స్వాగతం పలికారు. అనంతరం అకాడమీ అధికారులు డీజీపీకి గౌరవ వందనం సమర్పించారు. సందర్శన సందర్భంగా డీజీపీ అకాడమీలోని యూనిట్ హాస్పిటల్, పరిపాలనా విభాగం, ఆడిటోరియం, తరగతి గదులు, మెస్‌లు, క్రీడా భవన్, ఫైరింగ్ రేంజ్, పరేడ్ గ్రౌండ్లు తదితర శిక్షణా, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం అకాడమీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి శిక్షణా కార్యక్రమాలు, మౌలిక వసతులు, సంస్థాగత బాధ్యతలు, సంక్షేమ కార్యక్రమాలు, అకాడమీ ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ సమగ్ర ప్రజెంటేషన్ అందిస్తూ ప్రాథమిక (ఇండక్షన్), సేవాకాల (ఇన్–సర్వీస్) శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, మౌలిక వసతుల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమ చర్యల వివరాలను డీజీపీకి వివరించారు. సమీక్ష అనంతరం మాట్లాడిన డీజీపీ సి.వి. ఆనంద్, దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థల్లో తెలంగాణ పోలీస్ అకాడమీ ఒకటిగా గుర్తింపు పొందిందని ప్రశంసించారు. నాణ్యమైన పోలీసు శిక్షణ అందించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో జట్టుగా పనిచేయాలని సూచించారు. తాను గతంలో జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ (ఎన్ఐఎస్ఏ)లో పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, వృత్తిపరమైన పోలీసింగ్‌కు శిక్షణే బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలు (పీటీసీలు), జిల్లా శిక్షణా కేంద్రాలు (డీటీసీలు) సహా అన్ని శిక్షణా సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, ఇతర సంస్థాగత అవసరాల విషయంలో ప్రధాన కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అన్ని హోదాల్లోని పోలీసు సిబ్బందికి తప్పనిసరి శిక్షణా కోర్సులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి పూర్తి చేయాలని ఆదేశించిన డీజీపీ, మాదకద్రవ్యాల నియంత్రణ (ఎన్‌డీపీఎస్), సైబర్ నేరాల దర్యాప్తు, మోటార్ వాహనాల చట్టం అమలు, రోడ్డు భద్రత, ప్రజల్లో అవగాహన కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే తెలంగాణ పోలీసు అధికారుల రిట్రీట్ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. మహిళా పోలీసు సిబ్బంది సంక్షేమం, సమాన అవకాశాలు, సంస్థాగత సంస్కరణల బలోపేతానికి "తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్" కార్యక్రమాన్ని కూడా ప్రతి సంవత్సరం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీకి చెందిన సీనియర్ అధికారులు, శిక్షణాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఘనత

- ప్రతిభావంతులైన విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్సీల నగదు పురస్కారం
- నూతన విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం
- విద్యార్థులకు ఉచిత వెల్కమ్ కిట్, అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతి

**మహబూబాబాద్, జూన్ 03 (ప్రభాత గమనం):**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యా సంస్థలు ప్రైవేటుకు తీసిపోరని కేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలోనే అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల కీర్తిని దశదిశలా చాటారు.మహబూబాబాద్ జిల్లాలోనే టాపర్లుగా నిలిచిన కేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు లు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.మాలోతు ఆశ్రిత (బైపీసీ – ప్రథమ సంవత్సరం): 400 / 440 మార్కులు ఎండి. రేష్మ (ఎచ్ఈసీ – ప్రథమ సంవత్సరం): 428 / 500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల అద్భుత ప్రతిభపై హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపక బృందం నిరంతర కృషి, పర్యవేక్షణ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొంటూ అధ్యాపకులను అభినందించారు.ఉత్తమ ఫలితాల రికార్డుతో కేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన విద్యా సంవత్సరం (2026–27) అడ్మిషన్లకు సర్వం సిద్ధం చేసుకుందని తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే లక్ష్యంగా అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారని తెలిపారు.అందుబాటులో ఉన్న గ్రూపులు: ఎంపీసీ, బైపీసీ, సిఈసి, హెచ్ఈసి మరియు ఏసిఈ అని తెలిపారు. ఈ ఏడాది సరికొత్త ఆకర్షణలు ఈ విద్యా సంవత్సరం నుండి చేరే విద్యార్థులకు సరికొత్తగా వెల్కమ్ కిట్, ప్రతిరోజూ ఉదయం అల్పాహారం మరియు నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం ఉచితంగా అందించబడుతుందన్నారు."ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధునాతన వసతులు ఉన్నాయని కేసముద్రం పరిసర ప్రాంతాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. తక్షణమే అడ్మిషన్లు పొంది ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు."



## నందిగామ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్ ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు యువకులు మృతి

**హైదరాబాద్ జూన్ 3(ప్రభాత గమనం):**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గం నందిగామ బైపాస్ రోడ్డులోని గాయత్రి మిల్క్ ప్లాంట్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు, బైక్ ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను రోషన్ కుమార్ (24), కొత్తూర్ పట్టణ నివాసి, బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా, అలాగే పంకజ్ (19), నందిగామ పట్టణంలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇద్దరూ నందిగామ పట్టణంలోని ఎస్ఎన్ పాలీ ప్యాక్ కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ ఘటన స్థలం నుంచి పరారైనట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీ షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తెలంగాణలో 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష...

**హైదరాబాద్ జూన్ 3(ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. ఖైదీలు ఇవాళ జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి ఇవాళే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. అలాగే విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల పొందిన వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. గత ఏడాది కొత్త ప్రభుత్వం 213 మంది ఖైదీల విడుదలకు అనుమతి ఇవ్వగా, ఈసారి మరో 91 మందికి క్షమాభిక్ష మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం, అర్హులైన ఖైదీలకు ఏడాదిలో మూడు సార్లు విడుదల అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు.



## వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా వెంకటరమణ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ నూతన డీఎస్పీగా నియమితులైన ఎం. వెంకటరమణ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వెంకటరమణకు సూచించారు. కాగా, గతంలో వరంగల్ సైబర్ క్రైమ్ డీఎస్పీగా విధులు నిర్వహించిన కె. గిరికుమార్ మహబూబ్‌నగర్ సైబర్ క్రైమ్ డీఎస్పీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎం. వెంకటరమణ నియమితులయ్యారు.

# సైబర్ భద్రతపై అవగాహన

- ఎల్లాపూర్ స్లీపర్ కంపెనీలో ఏర్పాటు
- ఇన్ స్పెక్టర్ ఆకునూరి మహేందర్ కీలక సూచనలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నేపథ్యంలో ఉద్యోగుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఎల్లాపూర్ స్లీపర్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులకు సైబర్ భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. కంపెనీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో ప్రతి వ్యక్తి స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలను విస్తృతంగా వినియోగిస్తున్నందున సైబర్ నేరగాళ్లు కూడా కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వంటి సున్నితమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ముఖ్యంగా ఉద్యోగులు కార్యాలయానికి సంబంధించిన డేటా భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బలమైన పాస్‌వర్డ్‌ల సృష్టి, వాటి నిర్వహణ, ద్వి–దశ ధృవీకరణ (టు–ఫ్యాక్టర్ ఆథెంటికేషన్) ప్రాముఖ్యత, ఫిషింగ్ ఈ–మెయిల్స్, నకిలీ వెబ్‌సైట్లను గుర్తించే విధానాలు, సోషల్ ఇంజినీరింగ్ దాడులు, ర్యాన్సమ్‌వేర్ వంటి సైబర్ ముప్పులపై సవివరంగా వివరించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకపోవడం, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించడం, అధికారిక సాఫ్ట్‌వేర్‌లను మాత్రమే వినియోగించడం వంటి అంశాలపై ప్రాక్టికల్ సూచనలు అందించారు. అలాగే సంస్థకు సంబంధించిన గోప్యమైన సమాచారాన్ని సురక్షితంగా నిర్వహించడం, కార్యాలయ కంప్యూటర్లు, డిజిటల్ పరికరాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా సంస్థలకు ఆర్థిక నష్టం, డేటా లీకేజీలు, సైబర్ దాడులు వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, సైబర్ భద్రత అనేది కేవలం ఐటీ విభాగం బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగి తన బాధ్యతగా భావించి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా సంస్థ డేటాను రక్షించడంతో పాటు సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఉద్యోగుల్లో భద్రతా చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో ఉద్యోగులు సైబర్ భద్రతకు సంబంధించిన పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకోగా, భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. సైబర్ ముప్పుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, భద్రతా నియమాలను పాటించడం ద్వారా వ్యక్తిగతంగా, సంస్థాగతంగా సురక్షిత వాతావరణాన్ని నెలకొల్పవచ్చని ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ సూచించారు.

# గ్యాస్ ధరలపై ప్రభుత్వాల 'రాజకీయ చదరంగం'

- కేంద్రం, రాష్ట్రాల మధ్య నలిగిపోతున్న సామాన్యుడు
- ఓట్లు వేయించుకుని ఇప్పుడు సాకులు చెప్తారా?
- రూ. 500లకే సిలిండర్ హామీని బేషరతుగా అమలు చేయాలి
- కేంద్ర, రాష్ట్రాల వైఖరిపై మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ ఆగ్రహం

**గార్ల, జూన్ 3 (ప్రభాత గమనం) :**

ఎన్నికల ముందు ఓటర్లకు స్వర్గాన్ని చూపిస్తూ, అధికారంలోకి వచ్చాక ఆచరణ సాధ్యం కాని సాకులు చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిటిసి శీలంశెట్టి రమేష్ తీవ్రంగా ధ్వజమెత్తారు. గ్యాస్ సిలిండర్ ధరల విషయంలో ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న నిందారోపణల ఆటలో సామాన్య, మధ్యతరగతి ప్రజలే బలైపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ— ఎన్నికల ప్రచారంలో "రూ. 500 లకే సిలిండర్ ఇస్తాం" అని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కానీ కేంద్రం కాదని రమేష్ గుర్తుచేశారు."గ్యాస్ ధరలపై కేంద్రం నియంత్రణ ఏ విధంగా ఉంటుంది, సబ్సిడీల భారం ఎలా ఉంటుందో కనీస అవగాహన లేకుండానే హామీలు ఇచ్చారా?" అని ఆయన ప్రశ్నించారు. తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చి అమలు చేయాల్సి వచ్చేసరికి, కేంద్రం ధరలు పెంచిందంటూ నెపం నెట్టేయడం బాధ్యతారహిత్యమన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలి తప్ప, కేంద్రం వైపు వేళ్లు చూపించి చేతులు దులుపుకోవడం ప్రజలను వంచించడమే అవుతుందని మండిపడ్డారు.మరోవైపు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కూడా ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలు, చమురు సంస్థల నష్టాలంటూ సాకులు చెప్తూ కేంద్రం నిరంతరాయంగా గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోవడం అత్యంత విచారకరమన్నారు.

సబ్సిడీలను క్రమంగా తగ్గిస్తూ, పన్నుల భారాన్ని సామాన్యుడిపై మోపడం సంక్షేమ ప్రభుత్వ లక్షణం కాదు."ఉజ్వల" పథకం అంటూ భారీగా ప్రచారం చేసుకున్న కేంద్రం, సిలిండర్ల ధరలను సామాన్యుడికి అందుబాటులో లేనంత ఎత్తుకు పెంచేస్తే పేదవారి వంటింట్లో పొయ్యిలు ఎలా వెలుగుతాయి?రాష్ట్రాల రాజకీయాలతో సంబంధం లేకుండా, నిత్యావసరమైన గ్యాస్ ధరలను తగ్గించి దేశ ప్రజలకు ఉపశమనం కలిగించాల్సిన కనీస బాధ్యత కేంద్రానికి ఉందని ఆయన హితవు పలికారు.ఈ ధరల మంటల్లో తప్పు ఏ ఒక్కరిదో కాదు.. ఇద్దరిదీ సమాన బాధ్యతాయాహిత్యమేనని శీలంశెట్టి రమేష్ స్పష్టం చేశారు. ఒకరు ధరలు పెంచి సామాన్యుడి నడుం విరుస్తుంటే, మరొకరు ఆ ధరలను సాకుగా చూపిస్తూ ఇచ్చిన హామీల నుండి తప్పుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ చదరంగంలో సామాన్యుడి వంటింటిని పణంగా పెట్టవద్దని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రం ధరలను అదుపు చేయాలని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాను ఇచ్చిన రూ. 500 సిలిండర్ హామీని బేషరతుగా నెరవేర్చాలని, అంతవరకు ప్రజల తరఫున తమ నిరసన గళం వినబడుతూనే ఉంటుందని రమేష్ హెచ్చరించారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374